ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 294 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 31 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# జాతిపితకు రాష్ట్రపతి, ప్రధాని నివాళి



## రాజ్‌ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించిన నేతలు

**న్యూఢిల్లీ, జనవరి 30 (ప్రభాత ఉదయం):** జాతిపిత, స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి యావత్తూ నివాళి అర్పించింది. ఈ సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ నివాళులర్పించారు. వారు బాపూజీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. పలువురు కేంద్ర మంత్రులు సైతం నేడు గాంధీజికి నివాళులర్పించారు. స్పీకర్ ఓం బిర్లా సైతం నివాళి అర్పించారు. దేశవ్యాప్తంగా జాతిపితకు నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లి కార్జున ఖర్గేలు కూడా జాతిపితకు ఘనంగా నివాళి అర్పించారు. వీరంతా మహాత్ముడికి నివాళి అర్పించారు. పలు రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులు, మంత్రులు నివాళి అర్పించారు.

# మహాత్ముడికి గవర్నర్ జిష్ణుదేవ్, సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, జనవరి 30 (ప్రభాత ఉదయం):** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. గ్రామస్థాయి నుంచి రాజధాని వరకు బాపూకు నివాళి అర్పించారు. ఈ క్రమంలో హైదరాబాద్ బాపుఘాట్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ,పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,డీజీపీ జితేందర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఉన్నతాధికారులు నివాళులు అర్పించారు. బాపూఘాట్ చేరుకున్న వీరంతా బాపూ విగ్రహం వద్ద పూలు అర్పించి నివాళి అర్పించారు. సర్వమత ప్రార్థనలు సాగాయి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పలువురు ప్రముఖుల త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.





# రసాభాసగా జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్

### మేయర్ పోడియంపైకి ప్లకార్డులను విసిరేసిన కార్పొరేటర్లు
### మేయర్‌ను అడ్డుకున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు
### తోసేసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు

**హైదరాబాద్, జనవరి 30 (ప్రభాత ఉదయం):** జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ సమావేశం రసాభాసగా మారింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం ప్రారంభమైంది. అయితే సమావేశం మొదలైన వెంటనే గందరగోళ పరిస్థితి నెలకొంది. ముందుగా బడ్జెట్ ప్రవేశపెడుతామని మేయర్ చెప్పగా.. అందుకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ససేమిరా అన్నారు. ముందు ప్రజా సమస్యలపై మాట్లాడాలని రెండు పార్టీల సభ్యులు పట్టుబట్టారు. ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియం వద్దకు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్.. బీఆర్ఎస్ సభ్యుల నుంచి ప్లకార్డులను లాక్కొని చించేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు పార్టీల కార్పొరేటర్లు ఒకరినొకరు తోసేసుకున్నారు. సమావేశం మొదలైన ఐదు నిమిషాల్లోనే తీవ్ర గందరగోళం నెలకొనడంతో మార్షల్స్ కౌన్సిల్ మీటింగ్‌లోకి ప్రవేశించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఒకరినొకరు తోసుకోవడంతో పాటు దుర్భాషలాడుకున్నారు. మేయర్ పోడియంపై బీఆర్ఎస్ సభ్యులు ..మిగతా 3లో

# ఉపాధి పనుల్లో అపశృతి





### బండరాళ్లు పడి తల్లీ కూతుళ్ల మృతి
### ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి

సిద్దిపేట, జనవరి 30 (ప్రభాత ఉదయం): ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు పడి ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన అక్కన్నపేట మండలంలో గురువారం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలోని గుట్ట వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న క్రమంలో బండరాళ్లు కూలి ..మిగతా 2లో

### ఫోన్ ట్యాపింగ్ కేసులో
# మరో ఇద్దరికి బెయిల్ మంజూరు






**హైదరాబాద్, జనవరి 30 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరికి బెయిల్ మంజూరు అయ్యింది. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయలతో కూడిన 2 షూరిటీలూ సమర్పించాలని న్యాయస్థానం షరతు విధించింది. అలాగే వ్యక్తిగతమైన పాస్ పోర్టులు సమర్పించాలని ఇద్దరికీ ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని భుజంగరావు, రాధాకిషన్ రావుకు తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు ఇచ్చిన ..మిగతా 2లో

### నేటినుంచి పార్లమెంట్
# బడ్జెట్ సమావేశాలు


### ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం
### సమావేశాలపై ప్రభుత్వం అఖిలపక్ష భేటీ నిర్వహణ
### విపక్షాలకు వక్ఫ్ తదితర బిల్లుల జాబితా అందచేత



**న్యూఢిల్లీ, జనవరి 30 (ప్రభాత ఉదయం):** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. తరవాత సభలు వాయిదా పడతాయి. ఫిబ్రవరి1న నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఈ నేపథ్యంలోనే గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది. బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌కు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతోపాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్ట సవరణపై గతంలో కేంద్రం జేపీసీని ఏర్పాటుచేసిన ..మిగతా 2లో

### అమెరికాలో
# ఘోర విమాన ప్రమాదం

- ల్యాండ్ అయ్యే సమయంలో ఢీకొన్న హెలికాప్టర్
- నదిలో కుప్పకూలిన విమానం, హెలికాప్టర్
- ఏటిసి సమాచారం ఇచ్చి 30 సెకన్లలోనే ప్రమాదం
- 18మంది మృతదేహాలను వెలికి తీసిన సహాయక బృందాలు



**వాషింగ్టన్, జనవరి 30 (ప్రభాత ఉదయం):** అమెరికాలోని వాషింగ్టన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. 64 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం.. మరో హెలికాప్టర్ పరస్పరం ఢీకొన్నాయి. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆ రెండూ పక్కనే ఉన్న పోటోమాక్ నదిలో కూలిపోయాయి. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు, డ్రైవర్ల సాయంతో నదిలో గాలిస్తున్నారు. ఇప్పటివరకు 18 మంది మృతదేహాలను వెలికితీసినట్లు తెలుస్తోంది. పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరింది. వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. ..మిగతా 2లో



# 27ఎకరాల్లో రూ. 2వేల కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి

### 30 డిపార్టుమెంట్‌లు, 2 వేల పడకలు

**హైదరాబాద్, జనవరి 30 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్ గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో 27 ఎకరాల్లో దాదాపు 2వేల కోట్ల అంచనా వ్యయం తో ఈ కొత్త ఆస్పత్రి నిర్మాణం జరగనుంది. 30 డిపార్ట్‌మెంట్‌లు, 2వేల పడకలు, ఫిజియోథెరపీ, డెంటల్, కాలేజ్‌లు, హాస్టల్ వసతితో ఆసుపత్రి నిర్మాణం జరగనుంది. అడ్డంకులు దాటుకొని శంకుస్థాపనకు సిద్ధం అయింది ఉస్మానియా జనరల్ ఆసుపత్రి. రానున్న టెక్నాలజీ కాలానికి అనుగుణంగా హెలిప్యాడ్ వసతి,ఆసుపత్రి మురుగు నీరు శుద్ధి చేసేందుకు ప్లాంట్, విశాలమైన పార్కింగ్ ఫెసిలిటీ తో కొత్త ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. శనివారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్ కోసం స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్‌తో కూడిన ఆపరేషన్ థియేటర్లు, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఐసీయూ వార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. కిడ్నీ, లివర్, స్కిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల కోసం అత్యాధునిక టెక్నాలజీతో ..మిగతా 3లో



## పాఠశాలకు ఆర్‌వో
# వాటర్ ఫిల్టర్ అందజేత

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం)పాఠశాలలో తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని రూ.లక్షతో ఆర్‌వో వాటర్‌ఫిల్టర్ ఉచితంగా అందజేసి కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు తన ఉదారతను చాటుకున్నాడు. కేటిదొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ యువ నాయకుడు నరేష్ రూ.లక్షతో ఆర్‌వో వాటర్‌ఫిల్టర్లను ఏర్పాటు చేయించారు. వాటర్‌ఫిల్టర్లను గురువారం జిల్లా ఎంప్లాయ్ మెంట్ అధికారిణి డాక్టర్ ప్రియాంక, కేటిదొడ్డి ఎస్ఐ బి.శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు నరేష్ ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంప్లాయ్మెంట్ అధికారిణి డాక్టర్ ప్రియాంక విద్యార్థుల భవిష్యత్ కై కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాసెస్ నిర్వహించి, విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. పదవ తరగతి పాస్ అవ్వడానికి పాటించాల్సిన మెలకువలు వారు వివరించారు. చదువుతో పాటు నైపుణ్యం అవసరం అని, ఏదైనా పనిలో నైపుణ్యం పొందడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే స్వయం ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఅర్పీ యుగేంధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి పార్లమెంట్
# బడ్జెట్ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి...

సంగతి తెలిసిందే. వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి.. తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించాయి. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీజేపీ నుంచి జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి ఎంపీ జైరామ్ రమేశ్, గౌరవ్ గగోయ్ సహా ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు హాజరయ్యారు. సభ సజావుగా సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం అయిన అరగంట తర్వాత.. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి.

# ఉపాధి పనుల్లో అపశృతి

మొదటి పేజీ తరువాయి...

కందారపు సరోజన (50), తన కూతురు అన్నాజి మమత (35)లపై పడడంతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురికి పలు గాయాలయ్యాయి. రోజువారీగానే ఉపాధి హామీ పనులకు వెళ్లి పనులు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా కింద ఉన్న మట్టి కదిలి బండరాళ్లు మీద పడడంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారితో పాటు పనిచేస్తున్న ఐదుగురు కూలీలకు గాయాలు కావడంతో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ వాసాల సతీష్, సీఐ కొండ్ర శ్రీనివాస్, అక్కన్నపేట ఎస్సై విజయభాస్కర్ ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన ఇద్దరిని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న క్రమంలో పని ప్రదేశాన్ని ప్రమాద పరిస్థితుల్లో ఉందో లేదో అని గమనించకుండా ఫీల్ అసిస్టెంట్ వెంకటస్వామి పని చేయించడాన్ని స్థానికులు ఆయన పనితీరును తప్పు పట్టారు. ఉన్నతాధికారులు కూడా జరుగుతున్న పనిని పర్యవేక్షించకపోవడం వల్లనే ఈ ఘోర ప్రమాదానికి దారితీసిందని నాయకులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మరణించడం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఘటనకు సంబంధించిన కారణాలపై జిల్లా కలెక్టర్ మను చౌదరితో మాట్లాడినట్లు వెల్లడించారు. ఉపాధి హామీలో ఇద్దరి మరణానికి కారణమైన ఘటనపై జిల్లా అధికారులతో విచారణకు ఆదేశించి తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరికి నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. మరణించిన, గాయపడిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా కల్పించారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘటనపై కలెక్టర్ మను చౌదరితో చరవాణిలో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతి చెందిన ఇద్దరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

## ఏపీలో పెరిగిన
# రిజిస్ట్రేషన్ ఛార్జీలు
### రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రద్దీ



అమరావతి, జనవరి 30 (ప్రభాత ఉదయం) రిజిస్ట్రేషన్ విలువల సవరణ జరగడంతో, ఏపీలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగనున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువల సవరణ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏపీలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీ నెలకొంది. గుంటూరులో రాత్రయినా రిజిస్ట్రేషన్ల పక్రియ కొనసాగుతోంది.మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలు సవరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సవరించిన విలువలు అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌ను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ విలువల పెంపు, తగ్గింపు చేసే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఏడాది ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ విలువలు, స్ట్రక్చర్ విలువలను సవరించాలి. కానీ వైకాపా ప్రభుత్వం ప్రత్యేక రివిజన్ పేరుతో విలువలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపింది. వీటిపై సమీక్షించిన కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువలను సవరించాలని నిర్ణయించింది.

## అమెరికాలో
# ఘోర విమాన ప్రమాదం



మొదటి పేజీ తరువాయి...

రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. గగనతలంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో భారీ శబ్దం వినిపించింది.అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని.. స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. ఘటన సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. ఇక, హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారని, వీఐపీలు ఎవరూ లేరని రక్షణ శాఖ అధకారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికుల కోసం నదిలో గాలింపు కొనసాగుతోంది. ఇప్పటివరకు ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్'లో స్పందించారు. ప్రమాదం నుంచి ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం కాన్సాస్‌లోని విచిటా నుండి బయలుదేరింది. విమానం నదిలో కూలిపోయిన తర్వాత ప్రయాణికుల కోసం శోధిస్తున్నారు. ప్రమాదానికి కారణం అస్పష్టంగా ఉంది. ప్రమాదం కారణంగా రోనాల్డ్ రీగన్ విమానాశ్రయం నుండి విమాన సేవలు నిలిపివేసారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, కేవలం 30 సెకన్లలోనే అంతా జరిగిపోయినట్లు సమాచారం.కాన్సాన్ నుంచి వచ్చిన ప్రయాణికుల విమానాన్ని ల్యాండింగ్‌కు కొన్ని నిమిషాల ముందు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ సంప్రదించారు. రీగన్ ఎయిర్‌పోర్టులో కొత్తగా ఏర్పాటుచేసిన రన్‌వే 33పై ల్యాండ్ చేయగలరా అని అడిగారు. అందుకు పైలట్లు సమ్మతి తెలిపారు. దీంతో కొత్త రన్‌వేపై ప్రయాణికుల విమానం ల్యాండింగ్‌కు ఏటీసీ క్లియరెన్స్ ఇచ్చింది.సరిగ్గా అదే సమయానికి ఓ మిలిటరీ హెలికాప్టర్ ఆ మార్గంలోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్.. హెలికాప్టర్‌కు సమాచారమిచ్చారు. 'మీ ముందు విమానం వస్తోంది కన్పిస్తుందా?' అని అడిగారు. కొన్ని క్షణాల్లోనే మరో రేడియో కాల్‌ను పంపించారు. ఆ తర్వాత కేవలం 30 సెకన్లలోపే ఆ రెండూ ఢీకొన్నట్లు శబ్దం వినిపించింది. రన్‌వేకు 2400 అడుగుల దూరంలో ప్రయాణికుల విమానం నుంచి రేడియో ట్రాన్స్‌పాండర్ డేటా ఆగిపోయింది. విమానం సరిగ్గా నది మధ్యలో ఉన్నప్పుడే సిగ్నల్స్ ఆగిపోయాయని తెలిసింది.ప్రమాదం కారణంగా విమానం ముక్కలై నదిలో పడిపోయింది. హెలికాప్టర్ కూడా తలకిందులుగా కూలింది. ఘటన సమయంలో విమానంలో 64 మంది, హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారు. ఈ ప్రమాదంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు. ఘటన జరిగిన గగనతలం ప్రపంచంలోనే అత్యంత నియంత్రణతో, నిరంతరం పర్యవేక్షణలో ఉండే ప్రాంతం. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్, క్యాపిటల్‌కు దక్షిణాన కేవలం మూడు మైళ్ల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

## కుష్ట వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ సంతోష్





*గాంధీ వర్ధంతి సందర్భంగా అధికారులతో కలిసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్*

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం) మహాత్మా గాంధీ ఆశయం మేరకు కుష్ట వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి, అమరవీరుల స్మారక దినోత్సవంలో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాత్మా గాంధీ ఆశయాల మేరకు కుష్టు బాధితులకు వివక్ష లేకుండా ప్రేమతో సేవ చేయాలని, సమాజంలో వ్యాధిపై అపోహలను తొలగించి అవగాహన పెంచాలని అన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలను గౌరవిస్తూ, కుష్టు వ్యాధి బాధితులకు మద్దతుగా, వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడానికి ప్రతిజ్ఞ గావించారు. సమాజంలో ఎవరైనా చర్మంపై స్పర్శ కోల్పోయి మచ్చలు కలిగి ఉంటే, వాటిని తాకినప్పుడు నొప్పి కలగనప్పుడు దానిని కుష్ఠ వ్యాధిగా నిర్ధారించాలన్నారు. కుష్టు వ్యాధి కారణంగా అంగవైకల్యం ఏర్పడిన వ్యక్తులు ఉంటే, వారిపట్ల శ్రద్ధ వహించి వారికి సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలో పూర్తి చికిత్స తీసుకునేలా సూచనలు అందించాలన్నారు. వ్యాధిగ్రస్తులను సొంత కుటుంబ సభ్యుల్లాగా భావించి, వారికి అవసరమైన సలహాలు అందించి చికిత్సలు అందే విధంగా కృషి చేయాలని తెలిపారు. వారిపట్ల ఎలాంటి వివక్ష చూపరాదని, ఆత్మ గౌరవాన్ని భంగం కలిగించకుండా వారితో ప్రవర్తించాలని కోరారు. కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయదగినదని, సకాలంలో చికిత్స పొందితే అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన పెంచే విధంగా సందేశాలను విస్తృతంగా ప్రచారం చేస్తాను. మహాత్మా గాంధీ కలలు కన్న విధంగా భవిష్యత్తులో కుష్టు వ్యాధి రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ రావు, జిల్లా వైద్య అధికారి సిద్ధప్ప, ఏ.ఓ వీరభద్రప్ప, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో
# మరోమారు అగ్నిప్రమాదం
### సెక్టార్-22 వద్ద మంటలు చెలరేగి టెంట్లు దగ్ధం



లక్నో, జనవరి 30 (ప్రభాత ఉదయం) ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాట జరిగిన మరుసటి రోజే భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమమైన మహాకుంభమేళాలో అగ్ని ప్రమాదం జరగడం ఇది రెండోసారి. జనవరి 19న తొలి అగ్నిప్రమాదం జరిగింది. తాజాగా, గురువారం సెక్టార్-22 ప్రాంతంలో మంటలు చెలరేగి ఇప్పటికే అనేక టెంట్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తోంది. సీనియర్ అధికారులు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు చెలరేగిన స్థలంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం లేదు. అయితే, అగ్ని ప్రమాదానికి కారణాలేమిటో ఇంకా తెలియాల్సి ఉంది. కాగా, మౌని అమావాస్య సందర్భంగా బుధవారం తొక్కిసలాట జరిగింది. ఈ విషాధ ఘటనలో 30 మంది మరణించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ధృవీకరించింది. వాస్తవానికి 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు అనధికారిక సమాచారం. జనవరి 19న జరిగిన కూడా అగ్ని ప్రమాదం జరిగి సుమారు18 టెంట్లు దగ్ధమయ్యాయి. మొత్తంగా మహాకుంభమేళా ప్రారంభైన నాటి నుంచి మూడు అవాంఛనీయ ఘటనలు జరిగాయి. వీటిలో తొక్కిసలాటే అత్యంత విషాదకర ఘటన.మహాకుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం జరిగింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరికి బెయిల్ మంజూరు

మొదటి పేజీ తరువాయి...

స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని చాలా కీలకమైన అంశాలు బయటపడ్డ విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు పాత్ర ఉందని దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. నాంపల్లి కోర్టు వీరి బెయిల్ పిటిషన్‌ను రెండు సార్లు తిరస్కరించింది. దీంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు ఇద్దరు. ఈ కేసులో పదినెలలకు పైగా జైలులో ఉన్నామని, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని ఇరువురు హైకోర్టును కోరారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ఇద్దరికీ బెయిల్ మంజూరు చేసింది. అలాగే ఈ కేసులో ఇంకా విచారణ సాగుతోందని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని, దర్యాప్తు అధికారులను కూడా ప్రభావితం చేసేలా ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. విదేశాలకు పారిపోయేందుకు అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించడంతో వారి వ్యక్తిగతమైన పాస్ట్‌పోర్టులను సమర్పించాలని ఆదేశించింది. పోలీసులు ఎప్పుడు పిలిచినా వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని భుజంగరావు, రాధాకిషన్‌రావుకు ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే అనారోగ్య కారణాలతో రాధాకిషన్‌రావు ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. ప్రస్తుతం హైకోర్ట్ బెయిల్ మంజూరు చేయడంతో భుజంగ రావు రేపు (శనివారం) ఉదయం బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వందేళ్లు వెనక్కి
### మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ఆరోపణలు

**నిజామాబాద్, జనవరి 28 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ పాలనతో తెలంగాణ వందేళ్లు వెనక్కి వెళ్లే దుస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. రేవంత్ పాలనతో రాష్ట్రంలో భయంకర రోజులు వచ్చాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. అర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 130 ఏళ్ల చరిత్ర ఉన్నదని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిలువునా మోసం చేస్తుంది. చేతిలో ఎర్రబుక్కు పట్టికొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదు..? అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది అని కవిత మండిపడ్డారు. అబద్దాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారు. అబద్ధం అద్దం ముందు నిలబడితే రేవంత్ రెడ్డి బొమ్మ కనబడుతుంది. గ్రామ సభల్లో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికి ఇస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. సచివాలయంలో ఏసీ గదుల్లో కూర్చొని తయారు చేసిన లబ్దిదారుల జాబితాను గ్రామాల్లోకి తీసుకొచ్చి చదువుతున్నారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీస్తే అది తుది జాబితా కాదని మాటమారుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనతో ఉంది. తాము చెప్పినవాళ్ళకే పథకాలు వస్తాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువకాలం పరిపాలించలేరు. అలవిగాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చింది. కరెంటు ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అనే తెలియని దుస్థితి ఏర్పడిందన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో గాంధీజీ వర్ధంతి



హైదర్ గూడ లో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పించిన కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, మ్యాడం రామేశ్వర్ రావు, కొలన్ సుభాష్ రెడ్డి తదితరులు



ఉడంగడ్డలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులు అర్పించిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ సదాలక్ష్మి, తదితరులు



బుద్వేల్ శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరం ఆవరణలో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పించిన పెండ్యాల సాయి మల్లిక్, మజ్జిగ నరేష్ యాదవ్

బుద్వేల్, జనవరి30(ప్రభాత ఉదయం): అహింసా అనే ఆయుధంతో భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ ని భారతీయులంతా బాపుజీ గా, మహాత్మునిగా పిలుచుకుంటారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి ని పురస్కరించుకుని గురువారం హైదర్ గూడ లోని గాంధీ జీ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ సుభాష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సోమారం రవీందర్, బీజేపీ చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎన్.మల్లారెడ్డి, ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మోండ్ర నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, కార్యదర్శి కొండమీది హరినాధ్. వివిధ పార్టీల నాయకులు బి.రమేశ్. శెట్టిగారి నరేందర్ (చిన్న), షాబాద విజయ్ కుమార్. కొంగళ్ల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఉడంగడ్డ దళిత బస్తీలో..**

ఉడంగడ్డ దళిత బస్తీలో మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి ని నిర్వహించారు. దేశం కోసం మహాత్మాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సరిత, జి.సుజాత, కలమ్మ, దేవీ, సంతోస, వై. సుజాత, అం డాలు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

**బుద్వేల్ శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరం ఆవరణలో...**

బుద్వేల్ శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరం ఆవరణలో గల గాంధీ జీ విగ్రహానికి శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయిమల్లిక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మజ్జిగ నరేశ్ యాదవ్, శివ, ప్రభాకర్ గౌడ్, శ్రీకాంత్, సాయి సాగర్, మల్లేశ్, వేణు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్ లో...**

రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.




రాజేంద్రనగర్ నవాజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పించిన క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్



భవాని కాలనీ వాసులతో కలిసి సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ బుర్ర భూపాల్ గౌడ్

## ప్రజల ఆకాంక్షల కనుగుణంగా పనిచేశా

### మాజీ కార్పొరేటర్ బుర్ర భూపాల్ గౌడ్

### భవాని కాలనీలో రోడ్ల పనుల సమీక్ష

బండ్లగూడ, జనవరి 30(ప్రభాత ఉదయం) ప్రజలు ఎంతో నమ్మకంతో తనను కార్పొరేటర్ గా ఎన్నుకున్నారని ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా గత ఐదేళ్లు పనిచేశానని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ 8 వార్డ్ కార్పొరేటర్ బుర్ర భూపాల్ గౌడ్ అన్నారు. గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో భవాని కాలనీలో మాజీ కార్పొరేటర్ బుర్ర భూపాల్ గౌడ్ రోడ్ల అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు భూపాల్ గౌడ్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బుర్ర భూపాల్ గౌడ్ మాట్లాడుతూ ...రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెప్పించామని, గత ఐదేళ్లలో కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా, వార్డ్ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.కాలనీ వాసులు అభివృద్ధి కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ, బుర్ర భూపాల్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షురాలు శైలజ జ్ఞానేష్, జనరల్ సెక్రటరీ వెంకటేష్, ట్రెజరర్ నాగేశ్వర్ రెడ్డి, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మైలార్ దేవ్ పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## కాటేదాన్ ఇండోర్ స్టేడియంను క్రీడాకారులకు ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారు

బుద్వేల్, జనవరి30 (ప్రభాత ఉదయం): కాటేదాన్ లో నిర్మించిన జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియ క్రీడాకారులకు ఎప్పటికి అందుబాటులోకి తీసుకువస్తారని గ్రేటర్ కౌన్సిల్ సమావేశంలో అధికారులను ప్రశ్నించినట్లు మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇండోర్ స్టేడియం ను నిర్మిస్తామని పది సంవత్సరాలుగా చెబుతున్నారని, ఇంకా పూర్తి కాలేదన్నారు. పనులు కాకపోయిన ఎన్నికలకు ముందు హడావిడిగా ప్రారంభోత్సవం చేశారని గుర్తు చేశారు. నీళ్లు లేకున్నా రూ.6.5 కోట్లతో స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణం చేశారని వాపోయారు. ఇప్పటికైన మేయర్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కాటేదాన్ ఇండోర్ స్టేడియంను సందర్శించి ఆ స్టేడియంను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మైలార్దేవుపల్లి డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.



మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులకు భీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## రైతు బీమా అన్నదాతల కుటుంబ సభ్యులకు ఎంతో తోడ్పాటు

### ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### రైతు భీమా చెక్కు అందజేత

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలం రంగాపురం గ్రామానికి చెందిన లక్ష్మన్న అనే రైతు అనారోగ్యంతో మృతి చెందారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రైతు భీమా పథకానికి దరఖాస్తు చేసుకోగ, మంజూరైన రూ.5 లక్షల రైతు భీమాను గురువారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా మృతుని భార్య అంజనమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## 27ఎకరాల్లో రూ. 2వేల కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి

మొదటి పేజీ తరువాయి...

కూడిన ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం కొత్త ఉస్మానియాలో అందుబాటులోకి రానున్నాయి. పేషెంట్ల సౌకర్యార్థం అన్ని రకాల డయాగ్నసిస్ సేవలను ఒకే చోట అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఓపీ సేవలు అందించాలని పేషెంట్ల కోసం విశాలమైన వెయిటింగ్ హాల్స్, కనీసం రోజూ 3 వేల నుంచి 5 వేల మంది పేషెంట్లు వచ్చే అవకాశం ఉన్నందున, ఇందుకు అనుగుణంగా ఓపీ కౌంటర్ల నిర్మాణం జరగనుంది.ఓపీ కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడే ప్రసక్తే ఉండకుండా నిర్మాణం. కొత్త ఉస్మానియాలో నర్సింగ్, డెంటల్, ఫిజియో థెరపీ కాలేజీలు అందుబాటులోకి..స్టూడెంట్ల కోసం హాస్పిటల్ ఆవరణలోనే హాస్టల్స్‌ను నిర్మనం. 750 సీట్లతో కూడిన భారీ ఆడిటోరియం అందుబాటులోకి రానుంది.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 25 మందికి వివిధ విభాగాలలో ప్రమోషన్లు

### గురువారం జరిగిన పాలక మండలి లో ఆమోదం

### వర్సిటీ ఉన్నతాధికారుల నియమాలకు కూడ ఆమోదం

### త్వరలో ప్రకటించే అవకాశం



వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిపాలన భవనం

బుద్వేల్, జనవరి30 (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన పాలకమండలి సమావేశంలో 25 మంది అధ్యాపకులకు ప్రమోషన్లు ఇచ్చారు. కెరీర్ అడ్వాన్స్మెంట్ స్కీమ్(సీఏఎస్) లో బాగంగా ఈ ప్రమోషన్లు ఇచ్చినట్లు తెలిసింది. గతంలో వైస్ చాన్సలర్ గా ఉన్న వారు యూజీసీ లో లేని నిబంధనలు పెట్టి కోర్టు తీర్పులను కూడా అమలు చేయకుండ పెండింగ్ లో ఉంచిన ప్రమోషన్లన్నింటిని గురువారం జరిగిన పాలకమండలి లో క్లియర్ చేసి అర్హులైన వారికి ప్రమోషన్లు ఇచ్చారు. వాటిలో సీనియర్ ప్రొఫెసర్లు, సెలక్షన్ గ్రేడ్ ప్రమోషన్లు ఉన్నాయి. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ క్యాటగిరీలలో ఉన్న వారు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**యూనివర్శిటీ, డైరెక్టర్లు, ఏడీఆర్, ఏడీలను కూడా త్వరలో భర్తీ చేస్తాం**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గడిచిన 13 సంవత్సరాలుగా పూర్తి స్థాయి యూనివర్శిటీ అధికారులు లేరు. యూనివర్శిటీ అధికారుల నియామకాలకు ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. వాటన్నింటికి గురువారం జరిగిన పాలకమండలి సమావేశంలో ఆమోదం తీసుకున్నట్లు సమాచారం. వాటిని త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. యూనివర్శిటీ అధికారులైన రిజిస్ట్రార్, డీన్ అగ్రికల్చర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్, డీన్ పీజీ స్టడీస్, డీన్ కమ్యూనిటీ సైన్స్, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్, యూనివర్శిటీ లైబ్రేరియన్ నియామకాలను ప్రకటించాల్సి ఉంది. వీటితో పాటు డైరెక్టర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్, డైరెక్టర్ పాలిటెక్నిక్స్, డీన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్లతో పాటు పాలెం, జగిత్యాల, వరంగల్ ప్రాంతీయ పరిశోదనా సంచాలకులు, ఎనిమిది వ్యవసాయ కళాశాలల అసోసియేట్ డీన్లను నియామించాల్సి ఉంది. వాటన్నింటికి కూడా మూడు నాలుగు రోజులలో పూర్తి స్థాయి అధికారులను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



బుద్వేల్ గ్రీన్ సిటీలో పునర్నిర్మాణం చేసిన శ్రీ ఈదమ్మ తల్లి దేవాలయం




అమ్మవారు


## బుద్వేల్‌లో శ్రీ ఈదమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం

### శ్రీ నాగ దేవత ప్రతిష్ఠ
### శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి
### శ్రీ మాంధాత మహారాజు,
### సింహ వాహన, శిఖర దేవతల ప్రతిష్ఠ
### గురువారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పూజలు

బుద్వేల్, జనవరి 30(ప్రభాత ఉదయం): బుద్వేల్‌లో పురాతన అమ్మవారి దేవాలయాన్ని పునర్నిర్మారణం చేసి దేవతా మూర్తులను ప్రతిష్టించే కార్యక్రమంలో బాగంగా గురువారం దేవతామూర్తుల విగ్రహాలను పురవీధులలో ఊరేగించారు. స్థానిక ఈదమ్మ దేవాలయం నుంచి బుద్వేల్ పుర వీధులలో సాగిన ఊరేగింపు పొడువునా భక్తులు అమ్మవారి విగ్రహాలకు స్వాగతం పలుకుతు కొబ్బరి కాయలు కొట్టి నీళ్ల బిందెలతో సౌక పెట్టారు. అమ్మవారి విగ్రహా ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బుద్వేల్ బస్తీ పెద్దలు తెలిపారు. ఈ దేవాలయంలో శ్రీ నాగదేవత, శ్రీ ఈదమ్మ తల్లి. మాందాత అమ్మవారు, శ్రీ భద్రకాళీ అమ్మవారు. వీరభద్ర సింహవాహన, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపడతామన్నారు. శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి మహా గణపతి పూజలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. గోమాత పూజ, యాగశాల ప్రవేశం. ద్వజారోహణం, అఖండ దీపారాధన లాంటి పూజలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి ఒకటవ తేదీలలో పూజలు ఉంటాయని, రెండవ తేదీన విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుద్వేల్ కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ పూజలలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పూజా కార్యక్రమాలను శ్రీ మాతా చండి ఉపాసకులు బ్రహ్మ శ్రీ వేదాంత రేవల్లి రాజు శర్మ చేతుల మీదుగా నిర్వహిస్తున్నారు.



నాగ దేవతలు



విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేయనున్న బ్రహ్మ శ్రీ వేదాంత రేవల్లి రాజు శర్మ



దేవతా మూర్తుల ఊరేగింపు

## రసాభాసగా జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ మీటింగ్

మొదటి పేజీ తరువాయి...

ప్లకార్డులు విసిరారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను రాష్ట్రంలో అమలుకావడం లేదని, గ్రేటర్ హైదరాబాద్‌లో నిధులు ఎక్కడిక్కడ దుర్వినియోగం అవుతున్నాయని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగట్లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులు పట్టుకుని కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చారు. మేయర్ వద్దకు దూసుకెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ కార్పేరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్ వారిని అడ్డుకున్నారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేశారు. మరోవైపు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు విరుచుకుపడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటే అని అందుకే సమావేశం ముందుకు జరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారని కమలం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.



జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి

## దేశ స్వాతంత్ర సంగ్రామంలో మహాత్మా గాంధీ పాత్ర ఎనలేనిది: సదాలక్ష్మి

రాజేంద్రనగర్, జనవరి 30(ప్రభాత ఉదయం) దేశ స్వాతంత్ర సంగ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ కృషి ఎనలేనిదని పిసిసి మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమే మహిళా నాయకురాలతో కలిసి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్ళు సరిత, జి సుజాత, కలమ్మ,దేవి ,సంతోష, వై సుజాత, అండాలు ,మౌనిక తదితరులు పాలొగొన్నారు.



అన్నదానం చేస్తున్న హెల్ప్ ఆన్ వీల్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు బండ్ల గూడెం ప్రసాద్, బండ్ల గూడెం కవిత లు

## హెల్ప్ ఆన్ వీల్స్ ఆద్వర్యంలో అన్నదానం

బుద్వేల్, జనవరి30(ప్రభాత ఉదయం): ఆకలితో ఉన్న వారికి భోజనం పెట్టాలనే ఆలోచనతో నాలుగు నెలల నుంచి హెల్ప్ ఆన్ వీల్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుద్వేల్‌లో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. గురువారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అద్యక్షులు బండ్లగూడెం ప్రసాద్, బండ్లగూడెం కవిత లు పాల్గొని అన్నదానం చేశారు. మానవ %×% సేవే మాధవ సేవ అని వారు గుర్తు చేశారు. నెలకు ఒక రోజు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సామాజిక సేవలో బాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. గతంలో బస్ స్టాప్ ల వద్ద ప్రయాణికులు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. ఆసుపత్రుల వద్ద రోగుల బంధువులకు అన్నదానం చేసే వారమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అప్పారెడ్డిగూడెం మహేందర్, కోరని జాన్ రవి, గుంటి ప్రశాంత్. బండ్ల నరేందర్. గుంటి రవి, కోరని కుమార్, గుంటి సురేశ్ మాదిగ, బెంజమిన్, గజ్జల ప్రమోద్, బండ్ల కెవిన్. కోరని బిట్టు శాంతి లు పాల్గొన్నారు.



హార్టికల్చర్ విద్యార్థులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను విడుదల చేస్తున్న ఉపకులపతి డాక్టర్ డి రాజిరెడ్డి

## విద్యార్థి సంఘం క్యాలెండర్ ప్రారంభించిన హార్టికల్చరల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ రాజిరెడ్డి

రాజేంద్రనగర్, జనవరి 30(ప్రభాత ఉదయం) ఆల్ ఇండియా అగ్రికల్చరల్ స్టూడెంట్స్ అసోసియేషన్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షుడు నాగులపల్లి సంగారెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్ ను శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ రాజి రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డిఎస్‌ఏ డాక్టర్ విజయ , విద్యార్థులు శివరాజ్ ,ప్రశాంత్ ,చంటి ,రాజు ,చికిల్ రెడ్డి ,అలేఖ్య ,హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.




సత్యము, అహింస మహాత్మా గాంధీ సిద్ధాంతాలు

## మహాత్మా గాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి

### ఎన్ఎస్ యు ఐ నాయకులు గొల్ల జాన్

కూత్బుల్లాపూర్,జనవరి 30 (ప్రభాత ఉదయం) మహాత్మా గాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను పాటించాలని ఎన్ ఎస్ యు ఐ నాయకులు గొల్ల జాన్ అన్నారు. జాతీయ ఎన్ఎస్ యు ఐ అధ్యక్షుడు వరుణ్ చౌదరి సూచనల మేరకు మహాత్మా గాంధీ జ్ఞాపకార్థం, ఆయన వర్ధంతి సందర్భంగా, తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరపున ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ తీవ్ర అన్యాయం జరుగుతున్న తరుణంలో సామాజిక న్యాయం, రాజ్యాంగం చిరస్మరణీయమన్నారు. రాజ్యాంగంపై బిజెపి-ఆర్ఎస్ఎస్ల ముందరి దాడి డా. అంబేద్కర్ విలువలకు పెనుముప్పు అని, ఆయన మనకు అందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, పాలక పాలనలో అణచివేయబడిన సమాజంలోని అట్టడుగు వర్గాలను ఉద్ధరించడానికి మా నిబద్ధతను పునరుద్ఘాటించామని అన్నారు. దేశం ఇప్పుడు రెండు రకాల శక్తులతో కూడి ఉంది - రాజ్యాంగాన్ని వక్రీకరించి నాశనం చేయాలనుకునే వారు, రాజ్యాంగాన్ని, మన దేశాన్ని, మన విలువలను, మన ప్రజల భవిష్యత్తును రక్షించడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నవారు ఉన్నారని అన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో దేశ విముక్తి కోసం జరిగిన పోరాటంలో కాంగ్రెస్ పాల్గొన్నట్లే, మనం విజయం సాధించే వరకు పట్టు వదలలేదు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ కుటుంబం పోరాడుతుందని అన్నారు. మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగం యొక్క బోధనలను మేము విశ్వసించడం భారతదేశానికి మా నిబద్ధత అని తెలిపారు. విద్యార్థి సోదరులు చిరకాలం జీవించాలని, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

## కేటిదొడ్డి మండలంలో పలు దుకాణాలలో చోరీ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలం మైలగడ్డ స్టేజ్ సమీపంలో గల అయిదు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజుమున చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం....కేటిదొడ్డి మండలం రాయచూర్ ప్రధాన రహదారి పై మైలగడ్డ స్టేజ్ సమీపంలో మైలగడ్డ, గంగన్ పల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులు రేకులషెడ్డు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మైలగడ్డ స్టేజ్ లో గల ఓ ఫర్టిలైజర్, ఓ ఆన్ లైన్ సీఎస్ సి సెంటర్, ఓ కిరాణం, ఇంజనీరింగ్ వర్క్ షాపు, మోటార్ వైండింగ్ దుకాణాలలో వెనుక భాగం, పై భాగంలో ఉన్న రేకులను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి లోనికి ప్రవేశించారు. ఫర్టిలైజర్ దుకాణంలో సుమారు రూ.10వేల నగదు, ఒక సెల్ పోన్, సీఎస్ సి సెంటర్ లో కొంత నగదు, కిరాణం దుకాణంలో సుమారు రూ.3వేల వరకు నగదు, మోటార్ వైండింగ్ షాప్ లో మోటార్ కాపర్ వైర్ ను, వేయింగ్ మిషన్ ను ఎత్తుకెళ్లారు. మోటార్ వైండింగ్ షాపులో ఎత్తుకెళ్లిన కాపర్ వైర్ ధర సుమారు లక్ష రూపాయాల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఇంజనీరింగ్ షాప్ లో ఎలాంటి నగదు లేకపోవడంతో వెళ్లిపోయారు. గురువారం ఉదయం దుకాణాలను తెరిచిన యజమానులకు కౌంటర్లు తెరిచి ఉండటం, ఇనుప రేకులు కత్తిరించి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని గుర్తించారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దుకాణాలో ఉన్న సీసి కెమెరాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. నిత్యం గద్వాల రాయచూరు రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగుతున్నాయని, రాత్రి వేళలో పోలీసుల నిఘా లేకపోవడంతోనే వరుస చోరీలు జరుగుతున్నాయని మండల ప్రజలు ఆరోపించారు. గతంలో మైలగడ్డ స్టేజ్ లో ఉన్న పలు దుకాణాలలో దొంగతనాలు జరగాయని మండల ప్రజల అన్నారు. రాత్రి వేళలో పోలీసుల గస్తీ పెంచాలని మండల ప్రజలు కోరారు.



షెట్టర్పై భాగంలో కట్టింగ్ చేసి చోరీకీ పాల్పడిన దృశ్యం

## రైతు పండించిన పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వాలి

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం)రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు డిమాండ్ చేశారు. గురువారం గద్వాల మార్కెట్ యార్డులో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, రైతులతో కలిసి వేరుశనగ ను పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డ్ లో అధికారులను కలిసి వేరుశనగ , ఇతర పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.... ఖరీదుదారులతో కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా పాలకవర్గం చేస్తున్నారని, మార్కెట్ యార్డులో ఎన్నో మోసాలు జరుగుతున్నా చూసి చూడనట్లు పోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేరు శనగ పంటకు కనీస మద్దతు ధర క్వింటాల్కు రూ.6,783 ధర అందేలా చూడాలన్నారు. రైతులు పండించిన పంటకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం మద్దతు ధర ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చేంత వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల తరపున పోరాడుతుందని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ప్రతి ఒక్కరికి అమలు చేస్తామని చెప్పి, మండలంలో ఒక గ్రామానికి వేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కురువ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు మోనెష్, డి.శేఖర్ నాయుడు, శ్రీ రాములు, గంజిపేట రాజు, శ్రీనివాసులు, బీచుపల్లి, తిమ్మప్ప గౌడ్,ఎండి.మాజ్,ముని మౌర్య,ఆటో ముక్బాల్,పరశురాముడు,వీరేష్ గౌడ్,గంగాధర్, బషీర్, కురువ బజారి, సుధాకర్,కామేష్, పార్టీ నాయకులు,కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీ మహాత్ముడి వర్ధంతి వేడుకలు



గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్రెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం) నవ భారత నిర్మాణానికి గాంధీ మహాత్ముడి బోధనలే మార్గదర్శనీయ మని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం గద్వాల పట్టణం చింతలపేటలోని గాంధీజీ విగ్రహానికి గద్వాల ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గాంధీ మహాత్మున్ని ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన బాటలో నేటి యువత పయనించాలని ఎమ్మెల్యే ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా గద్వాల పట్టణం గాంధీచౌక్లో గల గాంధీజి విగ్రహా నికి జెడ్పీ మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జీ సరిత, గద్వాల మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్ముని ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని, గాంధీజీ చూపిన అహింసా మార్గంలో అందరు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణ మండపానికి భూమి పూజ చేస్తున్న రాయచూరు రూరల్ ఎమ్మెల్యే

## ఆలయాల అభివృద్ధి మానవ ధర్మం

### రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసన్ గౌడ్ దద్దల్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 30(ప్రభాత ఉదయం) సమాజంలో ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని, దేవాలయాలు మానవ మోక్షానికి మార్గాలని అందుకే ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కోసం దేవాలయాలకు సహకరించడం మానవ ధర్మమని రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే బసన్ గౌడ్ దద్దల్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసన్ గౌడ్ దద్దల్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ మండప నిర్మాణానికి ఆయన 10,01,101/- రూపాయలు విరాళంగా అందజేశారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి, దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నూతన కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ గ్రామంలో ఆలయాలు ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు భక్తి భావం పెరుగుతుందనీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డి 5 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఏమైనా ఉపయోగం ఉందా..?

### ముఖ్యమంత్రి నివాసం మీ లెక్క ప్యాలస్ కాదు దొర
### మీలా గడీల పాలన మాది కాదు, మాది ప్రజా ప్రభుత్వం
### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



కుత్బుల్లాపూర్,జనవరి 30 (ప్రభాత ఉదయం) బాధ్యత రహితంగా మాట్లాడుతున్నకేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి దావోస్ పర్యటన ను, కంపెనీలను నెగటివ్ ప్రచారం చేస్తూన్నారని, హామీలు అమలు చేస్తలేరని బిఆర్ఎస్ నాయకులు చేస్తూన్న ధర్నాల పై గురువారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కిషన్ రెడ్డి మీరు 5 సంత్సరాలు కేంద్ర మంత్రి గా ఉండి రాష్ట్రనికి ఏమైనా ఉపయోగం ఉందా..? మీరు అధ్యక్షులు గా ఉన్నప్పుడు పార్టీ ఎదిగిందా..? బండి సంజయ్ పుణ్యమా అని పార్టీ పైకి వచ్చింది. మూసి ప్రాంతంలో ఉంటూ వాళ్ళు ఓట్లేస్తే గెలిచి మూసి వాసన నుండి ప్రజలును బయట వేయలేకపోయారు అని, దేశం ఇంత ఆర్థిక ప్రగతి సాధించింది అంటే రాజీవ్ గాంధీ ఆలోచనతోనే 60 సంత్సరాల పాలనలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం విధానం వలనే మోదీ ఇప్పుడు ప్రశాంతంగా పాలన సాగిస్తునారు అన్నారు. దేశంలో లెఫ్టిస్ట్, హిందుత్వం అన్నీ ఉండాలి. గద్దర్ గురించి బండి సంజయ్ అవక్కులు చేవాక్కులు మాట్లాడుతున్నారని, అంబేద్కర్, గద్దర్, గాంధీ అందరిని అవమానించేలా మాట్లాడుతున్నరు. అంబేద్కర్ పాలన కొనసాగుతుంది అంబేద్కర్ నియమాలు పాటిస్తుంది బీజేపీ అని అంటున్నారు. కేంద్ర బీజేపీ పాలనలో భారతదేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి మతతత్వ పార్టీ అని కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతోందని విమర్శించారు. నరేంద్ర మోడీ అమిత్ షాలు రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తున్నారని, పార్లమెంట్ వేదికగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ను అవమానించారని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే ఈరోజు దేశంలో బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన నుండి కాంగ్రెస్ ప్రజాస్వామ్య పాలన కొనసాగుతుందని తెలిపారు. ప్యాలస్ లో కూర్చుని కమాండ్ కంట్రోల్ లో మీటింగ్స్ పెడుతున్నారని హరీష్ రావు మాట్లాడుతున్నారు. మీ హయాంలో ప్రగతి భవన్ లో ఒకరికి లోపలికి అవకాశం లేదు, ఇప్పుడు ఎవ్వరైనా ఎప్పుడైనా వెళ్లొచ్చు. సీఎం అప్పుడు అదే ఇల్లు ఇప్పుడు అదే ఇల్లు మీలా గడీల పాలన మాది కాదు అని అన్నారు. మీలాగా వందల ఎకరాల భూములు అమ్మలేదు హరీష్ రావు, మాట్లాడానికి ఇచ్చిన హామీలు అమలు చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తు పాలన సాగిస్తున్నామని అన్నారు. మీరు చేసిన ధర్నాలు చూసి ప్రజలు ఉమ్మేతున్నారు. మొగుణ్ణి కొట్టినమ్మ మొటకాలికి ఎక్కినట్లు ఉంది బిఆర్ఎస్ ధర్నాలు అని అన్నారు. చెప్పిన మాట కంటే ఎక్కువ చేస్తున్నాం మీలాగా గడిలో కూర్చోని నిర్ణయాలు తీసుకోవట్లేదు అని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలన్నింటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు కట్టుబడి ఉందని, దశల వారీగా వాటి అమలు ప్రక్రియను చేపడుతోందని తెలిపారు. ఓవైపు గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 22 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు. బిజెపి - బీఆర్ఎస్ ల మధ్య జైలు, బెయిలు బంధం కొనసాగుతుందని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి బీఆర్ఎస్-బీజేపీ కూటమి ప్రయత్నిస్తుందని విమర్శించారు.



## లింగ నిర్ధారణ చట్టరిత్యా నేరం

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం) లింగ నిర్ధారణ కోసం పరీక్షలు చేయించుకోవడం చట్టరిత్య నేరమని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద అన్నారు. గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల్ జిల్లా మహిళా సాధికారిక కేంద్రంలో బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో %ూజూచీణు% చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించార. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లి, బిడ్డ ఆరోగ్య సమస్యల కోసం పరీక్ష చేయించుకోవాలి కానీ చాలా మంది లింగ నిర్ధారణ కోసం పరీక్ష చెపించుకుంటున్నారని, లింగ నిర్ధారణ ద్వారా ఆడ బిడ్డల భ్రూణహత్యలకు దారి తీస్తుందన్నారు. ఆడపిల్లల పట్ల సామాజిక వివక్ష, కుమారుల పట్ల ప్రాధాన్యత కారణంగా దేశంలోని పురుషుల పట్ల లింగ నిష్పత్తిని వక్రీకరిస్తూ వివిధ రూపాల్లో ఆడ భ్రూణహత్యలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. మగబిడ్డ పుట్టే వరకు కుటుంబాలు నిరంతరం పిల్లలను ఉత్పత్తి చేసే ధోరణి ఉంది. గర్భం దాల్చడానికి తర్వాత తల్లి ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం తిసుకోవాలని అన్నారు. ఒత్తడికి లోను కాకుండా, ఉపవాసాలు ఉండరాదని, అలాగే %ూజూచీణు% చట్టం గురించి మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్ర సమన్వయకర్త జ్యోత్స్న, సఖి సెంటర్ సిబ్బంది శోభ, జిల్లా బాలల సంరక్షణ విభాగం సురేష్, చైల్డ్ లైన్ దస్తగిరి, ఆసుపత్రి సిబ్బంది, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



## టీయుడబ్ల్యూజే ఐజేయు నూతన డైరీ ఆవిష్కరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి30(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయు) ఆద్వర్యంలో రూపొందించిన 2025 మీడియా డైరీని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కమిటి కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసులు, జిల్లా నాయకులు సిరాజుద్దీన్, వెంకటేష్, చుక్క సుదర్శన్ రెడ్డి, సాక్షి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY.** “**RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608